ప్రజాశక్తి

బుధవారం 23 అక్టోబర్ 2024 5 అనంతపురం

అనంతపురం ఉప్పనేసనపల్లి వద్ద పేదల వేసుకున్న గుడిసెల వద్దకు చేరిన నీరు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. రాత్రి 12 గంటలకు ప్రారంభం అయిన వర్షం ఉదయం 6గంటల వరకు పడింది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, రాప్తాడు, పెనుకొండ, కొత్తచెరువు మండలాల్లో భారీ వర్షపాతం నమోదు అయ్యింది. అనంతపురం శివారు ప్రాంతంలో ఉన్న పండమేరు వంక పొంగిపొర్లింది. దీంతో శివారు కాలనీలు నీటమునిగాయి. పండమేరు వంక పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు అన్నీ జలమయం అయ్యాయి. రాత్రి 3 గంటల సమయంలో ఒక్కసారిగా మోకాళ్లలోతు వరద నీరు రావడంతో కాలనీవాసులు కట్టుబట్టలతో అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. కొందరు ప్రాణభయంతో మిద్దెలపైకి ఎక్కారు. ఇళ్లలోకి నీరు చేరి సామాగ్రి మొత్తం తడిసిపోయింది. పలు ద్విచక్ర వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. మిద్దెలపై ఉన్న వారిని సురక్షితంగా కిందకు దించి పునరావాస కేంద్రాలకు తరలించారు.పలు మండలాల్లో పంటలు నీటమునిగాయి.

అనంతపురం శివారులోని ఉప్పనేసిన పల్లి వద్ద నీటమునిగిన జగనన్న కాలని

పుట్టపర్తి వద్ద ప్రవహిస్తున్న చిత్రావతి నది

ముంచెత్తిన వాన

◆ పొంగిపొర్లిన పండమేరు
◆ నీటమునిగిన అనంత శివారు కాలనీలు
◆ నీటి ప్రవాహంతో నిలిచిన రాకపోకలు
◆ కనగానపల్లి, బండమీదపల్లి చెరువులకు గండి
◆ పలు పంటలు నీటమునక
◆ ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల పరిశీలన

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మగ్గం గుంతల్లోకి చేరిన వర్షం నీరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం క్రైం, పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాను వర్షం ముంచెత్తింది. సత్యసాయి, అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి అధిక వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఒక్కసారిగా పడిన అధిక వర్షాలకు కొన్ని చోట్ల చెరువులకు గండ్లుపడగా, మరికొన్ని చోట్ల రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సత్యసాయి జిల్లాలో సరాసరి వర్షపాతం 1902.2 మిల్లీమీటర్లు నమోదవగా, సగటు వర్షపాతం 59.4 మిల్లీమీటర్లు నమోదయింది. అనంతపురం జిల్లాలో సరాసరి వర్షపాతం 802.4 మిల్లీమీటర్లు పడగా, సగటు వర్షపాతం 25.4 మిల్లీమీటర్లు నమోదయింది. ఇందులో సత్యసాయి జిల్లాలో కనగానపల్లి మండలంలో అత్యధికంగా 198.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. దిగువకు నీరు వెళ్లడంతో ధర్మవరం చెరువు నిండింది. దిగువన తనకల్లు మండలంలోని చెన్నరాయస్వామి గుడి (సిజి) ప్రాజెక్టు నిండింది.

రాప్తాడు మండలం బండమీదపల్లిలో చెరువు తెగి నీటిలో పడి మృతి చెందిన గొర్రెలు

పలుచోట్ల చెరువులకు గండ్లు

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని బండమీదపల్లి గ్రామ చెరువుకు గండిపడింది. దీంతో చెరువు కిందనున్న పంటలు దెబ్బతిన్నాయి. బోయ లావణ్యకు చెందిన 80 గొర్రెలు, మేకలు నీటమునిగిచనిపోయాయి. రామిరెడ్డికి చెందిన చీనితోట దెబ్బతింది. ఈ నీరంతా దిగువనున్న పండమేరు వంకలోకి చేరడంతో పండమేరు వంక ఉధృతంగా ప్రవహించింది. నగర శివార్లలో పండమేరుకు ఆనుకుని ఉన్న రామకృష్ణ కాలనీతోపాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టరు శివనారాయణలు వెంటనే స్పందించి చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతాల్లోనున్న వారికి సహాయక చర్యలు చేపడుతున్నారు. పెనుకొండ వద్ద హంద్రీనీవా కాలువకు గండిపడటంతో నీరు పందిపర్తి, మంచేపల్లి చెరువుల్లోకిఉధృథంగా చేరుతోంది. విషయం తెలుసుకున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి గండిపూడ్చి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని హంద్రీనీవా ఇంజినీర్లకు ఆదేశాలిచ్చారు. వరద ఉధృతిలో గుట్టూరు వద్ద జాతీయ రహదారి 44పైకి నీరు రావడంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. ధర్మవరం -అనంతపురం మధ్య గుట్టూరు వద్ద చెరువు మరవపారి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇక్కడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 20 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పుట్టపర్తి నియోజకవర్గంలోనూ పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నీట మునిగిన జగనన్న లేఅవుట్

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి సర్వే నెంబర్ 194లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లోని ఇళ్లు మొత్తం సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నీటమునిగాయి. వేకువజామున 3గంటల సమయంలో మోకాళ్లలోతుకు పైగా వరదనీరు రావడంతో ఒక్కసారిగా కాలనీవాసులు భయాందోళనతో మిద్దెలపైకి ఎక్కారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వరద నీటిలో చిక్కుకున్న వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షంతో కట్టుబట్టలతో ఇంటి నుంచి బయటకు వచ్చేశామంటూ కాలనీవాసులు అధికారులు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీరు రావడంతో ఇళ్లలో ఉన్న నిత్యావసర సరుకులు, సామగ్రి పూర్తిగా నాశనం అయ్యిందన్నారు.

నీటమునిగినిన పంటలు

సత్యసాయి జిల్లాలో ఎనిమిది మండలాల్లో 17 గ్రామాల్లో వర్షం వల్ల నష్టం సంభవించిందని అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. 1146 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. 32.87 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ధర్మవరం డివిజన్‌లో 27 ఇళ్లు దెబ్బతినగా, కదిరి డివిజన్‌లో 14, పెనుకొండ డివిజన్‌లో ఐదు ఇళ్లు దెబ్బతిన్నాయి. అత్యధికంగా వర్షపాతం నమోదయిన కనగానపల్లిలో 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లాలో 315 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్టు అంచాన వేశారు. ఇందులో అత్యధికంగా వరి పంట 235 హెక్టార్లలో నష్టం సంభవించింది. 27 గ్రామాల పరిధిలో ఈ నష్టం జరిగినట్టు లెక్కించారు. ఉద్యానవన పంట నష్టం అంచనాలు ఇంకా రావాల్సి ఉంది.

శ్రీసత్యసాయి జిల్లాలో రికార్డు వర్షం

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అయ్యింది. కనగానపల్లి మండలంలో 198.2 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షం కురిసింది. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో సైతం భారీ వర్షం పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు రికార్డు స్థాయిలో జిల్లా వ్యాప్తంగా సరాసరి 1902.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. సగటు వర్షపాతం 59.4 మిల్లీమీటర్లు. ఇదే నెలలో వారం క్రితం ఒకేరోజు 1700 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం జిల్లాలో నమోదు అయ్యింది. దీనికి మించి సోమవారం రాత్రి ఏకంగా 1902.2 సరాసరి వర్షపాతం, సగటు వర్షపాతం 59.4 మిల్లీమీటర్ల కురవడం విశేషం. కుంభవృష్టి కారణంగా జిల్లాలోని అనేక చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండి మరువ పారాయి. జిల్లాలోనే పెద్ద చెరువుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం చెరువు మరువపారింది. కదిరి నియోజకవర్గంలోని తనకల్లు మండలంలో ఉన్న చెన్నకేశవ స్వామి గుడి (సీజీ ప్రాజెక్ట్) ప్రాజెక్టు నీటితో నిండుకుండలా కనిపిస్తోంది. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఈ ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి నీటిని కిందకు వదిలారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేశారు. కనగానపల్లి మండలం దాదులూరు పోతలయ్య గుడి వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వాగు ఉధతంగా ప్రవహిస్తోంది. ఈ వాగులో పశువులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. పుట్టపర్తి మండల పరిధిలోని చిత్రావతి వంగ పేరు, నదులు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి వంగపేరు ఉధతికి కొట్లపల్లి-నిడిమామిడి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పర్తిశ్రమల నుంచి విధులు ముగించుకుని వస్తున్న కొట్లపల్లి వాసులు ముగ్గురు నదిలో కొంత దూరం కొట్టుకుపోయారు. స్థానికులు వారిని రక్షించి క్షేమంగా బయటకు తీశారు. పుట్టపర్తి మండల పరిధిలోని వంగ పేరు, చిత్రావతి నదుల ఉధృతికి మండలంలో పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. పెడపల్లి, గంగంపల్లి ప్రధాన రహదారిలో చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో పెడపల్లి నుంచి గంగంపల్లి, గంగిరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి.

కొత్తచెరువు-ధర్మవరం రహదారిపై ప్రవహిస్తున్న వంగపేరు నది

భారీ వర్షాలతో నిలిచిన రాకపోకలు

పలు వాహనాలు దారి మళ్లింపు

కొత్తచెరువు రూరల్: భారీ వర్షంతో కొత్తచెరువు- ధర్మవరం ప్రధాన రహదారిలో రాకపోకలు స్తంభించాయి. కొత్తచెరువు మండల పరిధిలోని సత్య సాయి వాటర్ సప్లై పంపు వద్ద వంగపేరు నది ఉధతికి రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ఆ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. నీటి ఉధృతి తగ్గేంత వరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది నదిని దాటడానికి ఎవరినీ అనుమతించలేదు. కొత్తచెరువు నుంచి పెనుగొండకు వెళ్లే రహదారిలో రైల్వే బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో రహదారిలో రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగొండకు వెళ్లే వాహనాలన్నింటినీ మామిళ్లకుంట క్రాస్, జగరాజుపల్లి మీదుగా పెనుగొండ ప్రదాన రహదారి వైపు మళ్లించారు. పుట్టపర్తి నుంచి అనంతపురానికి వెళ్లి వాహనాలను దారి మళ్లించి జగరాజు పల్లి ,పెనుగొండ మీదుగా అనంతపురానికి పంపారు. మండల పరిధిలోని లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీరామ్ రెడ్డి వరి పంట పూర్తిగా నేల కొరిగింది. వంగపేరు నదీ పరివాహ ప్రాంతాన్ని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, కొత్తచెరువు తహశీల్దార్ నీలకంఠారెడ్డి పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

జలదిగ్బంధంలో దాదులూరు దేవాలయం

జలదిగ్బంధంలో ఉన్న దాదులూరు పోతలయ్య దేవాలయం

శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు గ్రామంలో ఉన్న పోతలయ్య స్వామి దేవాలయం చుట్టూ నీరు చేరింది. ఒక్కసారిగా పామేరు వంక పొంగిపొర్లడంతో ఆలయం చుట్టూ నీరు చేరింది.

ముంపు ప్రాంతాల్లో పరిటాల సునీత, శ్రీరామ్ పరిశీలన

అనంతపురంలో నీటమునిగిన కాలనీలను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం రూరల్ పరిధిలోని నీట మునిగిన ఉప్పరపల్లి తదితర కాలనీలను ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ సందర్శించారు. పండమేరు వాగు ఉధతికి నీట మునిగిన రాప్తాడు మండలం ప్రసన్నయపల్లి పంచాయతీ పరిధిలోని కళాకారుల కాలనీ, అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ, సద్గురు గురుదాస్ కాలనీల్లో జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలసి పర్యటించి, సహాయక చర్యలను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. పంట నష్టం, పశు నష్టాన్ని అధికారుల ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాలన్నారు. వర్షం వల్ల ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్న పరిటాల సునీత స్థానికులకు తెలిపారు.

పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

వరద ప్రభావిత ప్రాంతాల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించి, పరిస్థితిని అధికారులతో కలిసి సమీక్షించారు. నారా లోకేష్ కాలనీ, రామకృష్ణ కాలనీ, సుశీలరెడ్డి కాలనీ, తిమ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల వాసులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, మంచినీటి సౌకర్యం కల్పించారు.

ముంపు ప్రాంతాలకు ఎస్పీ

పండమేరు వంక పరిసర కాలనీలైన కళాకారుల కాలనీ, విన్సెంట్ డీ పాల్ స్కూలు ప్రదేశం, గురుదాస్ కాలనీ, టివి టవర్ శివారు కాలనీ, అనంతపురం-కదిరి జాతీయ రహదారిలోని పండమేరు బ్రిడ్జి, ఆటోనగర్ ప్రాంతాలను ఎస్పీ జగదీష్ మంగళవారం ఉదయం పరిశీలించారు. ఆయా కాలనీల వాసులతో మాట్లాడి వరద నీటి ఉధతి తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని వారికి సూచించారు.

బాధిత రైతులను ఆదుకోండి : వి.రాంభూపాల్

బండమీదపల్లిలో తెగిన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రాప్తాడు : వర్షం వల్ల పంటలు, ఇతర కుటుంబ సామగ్రిని నష్టపోయిన బాధితులు అందరినీ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. రాప్తాడు మండల పరిధిలోని బండమీద పల్లి గ్రామంలో వర్షం దాటికి చెరువ తెగి, దాని కింద ఉన్న పంటలు నీటమునిగాయి. బండమీదపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డితో పాటు పలువురు రైతులకు చెందిన పంటలు నీటిలో మునిగాయి. బాధిత రైతులను సిపిఎం నాయకులు మంగళవారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రామిరెడ్డి అనే రైతు చీనీ సాగు కోసం దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశాడన్నారు. వర్షంతో ఇప్పుడు ఆ రైతు పూర్తిగా నష్టపోయాడన్నారు. ఇతనితో పాటు ఈ చెరువు కింద దాదాపు 70 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులకు పూర్తి స్థాయి పరిహారం ఇవ్వాలని కోరారు. చెరువులు, కుంటలు, కాలువలను అధికారులను పరిశీలించి అవసరం అయిన చోట వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. బండమీద పల్లి గ్రామానికి చెందిన చల్లాపురం పూజారి బోయ మాధవయ్యకు చెందిన 90 గొర్రెలు నీటిప్రవాహంలో మునిగి చనిపోయాని, బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాప్తాడు మండల కార్యదర్శి ఎం.పోతలయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజనేయులు పాల్గొన్నారు.

పాముదాయిలో నీటి మునిగిన వరిపంట

పడిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న పాముదాయి వెంకటేష్

వర్షం దెబ్బకు అనంతపురం రూరల్ పరిధిలో పాముదాయి గ్రామంలో వరి పంట దెబ్బతింది. చేతికొచ్చిన పంట నూర్పిడి చేసిన వరి కుప్పలు నీటితో తడిసిపోయాయి. బాధిత రైతులను మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పాముదాయి వెంకటేష్ పరామర్శించారు. సోమలదొడ్డి సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ జైచంద్ర పంట నష్టం వివరాలను సేకరించారు.

తెగిన హంద్రీనీవా కాలువ



హంద్రీనీవా నుంచి బయటకు వెళ్తున నీరు

సోమందేపల్లి : మండల పరిధిలోని మంచేపల్లి సమీపంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో హంద్రీనీవా కాలువ గట్టు తెగిపోయింది. కాలువలో నీరు మంచేపల్లి. పందిపర్తి గ్రామాల చెరువులకు చేరుతున్నాయి. ఇంకా అధికంగా వర్షాలు వస్తే చెరువులు కూడా తెగే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బొమ్మనహాల్‌లో పంట నష్టం

బొమ్మనహాల్ మండలంలో పడిపోయిన వరి పంట

బొమ్మనహాల్ : మండలంలోని వేదవతి నది కనేకల్-బళ్లారి ప్రధాన రహదారిపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. నీటి ఉధృతికి వేదవతి నదిపై ఏర్పాటు చేసిన గ్రావెల్ సిమెంట్ పైపులు కొట్టుకుపోయాయి. దీంతో బొమ్మనహాల్, విడపనకల్, కనేకల్, బళ్లారి వైపు వెళ్లే వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షం దెబ్బకు బొమ్మహాల్ మండలంలో పత్తి, మిరప, వరి తదితర పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టం వివరాలను అంచనా వేస్తున్నట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. కళ్ళు దేవనహళ్లి, ఉద్దేహాల్ వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో రాకపోకలను నిలువరించారు. వేదావతి పరివాహన ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

తెగిన వంతెన.. స్తంభించిన రాకపోకలు..!

తెగిపోయిన సున్నంపల్లి వంతెన

ఓబుళదేవర చెరువు: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సోమవతినది ప్రవహించింది. నీటి ఉధృతికి సున్నంపల్లి వంతెన తెగింది. దీంతో సున్నపల్లి పంచాయతీ పరిధిలోని సున్నంపల్లి, మలికవారిపల్లి, పెద్దిగుట్లపల్లి గ్రామాలకు రాకపోకులు స్తంభించాయి. మంగళవారం సాయంత్రం అధికారులు తెగిన వంతెన ప్రాంతంలో సర్పంచి ధారా లక్ష్మీదేవి, గ్రామస్తుల సహకారంతో రాళ్ల మట్టితో పూడ్చి వేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : మంత్రి

ధర్మవరం రూరల్ : అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. భారీ వర్షాల కారణంగా ధర్మవరం చెరువుతో పాటు గొట్లూరు చెరువు, కనగానపల్లి చెరువులు మరువపారి పొంగిపొర్లుతున్న నేపథ్యంలో సమీప గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకల కింద లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా భారీ వర్షం కురుస్తుండడంతో ఆ జిల్లా నుంచి జిల్లాకు వచ్చే వాగులు, వంకల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతపురం కంట్రోల్ రూం నుంచి అధికారులతో కలిసి ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

జాతీయ రహదారిపై వరదనీరు

పెనుకొండ : భారీ వర్షానికి పెనుకొండ మండలం వెంకటగిరిపాలెం చెరువు నిండిపోయింది. చెరువుకట్టపై నుంచి నీరు పెద్ద ఎత్తున ప్రవహించి 44వ జాతీయ రహదారిపై చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుట్టూరు సమీపంలో జాతీయ రహదారిపై మోకాళ్ల లోతుపైగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో పలు వాహనాలు నీటిలో చిక్కుకుని భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. కియా పరిశ్రమ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ సిబ్బందితో నీటిని తోడించి నీటిలో చిక్కుకున్న వాహనాలను జెసిబి సహాయంతో బయటికి తీసుకువచ్చారు. మోటువారి పల్లి చెరువు నిండి మరువ పారుతోంది. మండలంలోని శెట్టిపల్లి వెళ్లే దారిలో రైల్వే అండర్ పాస్‌లో భారీగా నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెనుకొండ పట్టణంలోని లోతట్టు ప్రాంతలైన బ్రాహ్మణ వీధి, కమాన్ వీధి తదితర ప్రాంతాల్లో వర్షం నీటితో నిండిపోయింది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పెనుకొండ డివిజన్‌లో దంచి కొట్టిన వాన

పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోని మండలాల్లో సోమవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. రొద్దం 55.2 మిల్లీమీటర్లు, మడకశిర 58.6, అమరాపురం 44.2, గుడిబండ 24.0, రోళ్ల 21.4, అగళి 48.6, పరిగి 35.6, పెనుకొండ - 89.8, సోమందేపల్లి 70.4, హిందూపురం 83.2, లేపాక్షి 70.2, చిలమత్తూరు 32.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. డివిజన్ మొత్తం 633.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సగటున 52.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

న్యామద్దల చెరువుకు మరువ ఉధృతి

మరువ పారుతున్న న్యామద్దెల చెరువు

చెన్నేకొత్తపల్లి : శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం పరిధిలోని న్యామద్దల గ్రామం చెరువు నీటితో నుంచి మరువ పారింది. మరువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరువ నీరు ఎక్కువగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను మధ్యాహ్నం వరకు ఆపేశారు. గ్రామ పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

భారం అనుకోవద్దు..బాధ్యతగా పని చేయండి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

'నేను బాధ్యతగా పని చేస్తా.. మీరు కూడా పని భారం అనుకోకుండా బాధ్యతెరిగి పని చేయాలి' అంటూ ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు భారంగా భావించక.. బాధ్యతెరిగి సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి వైపు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. ప్రజలు సమస్యలపై సచివాలయానికి వచ్చినప్పుడు విసిగించుకోకుండా గౌరవంగా వారితో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. తాను అభివృద్ధికి సహకరిస్తా.. ఉద్యోగులు బాధ్యతగా పని చేసి తాడిపత్రిని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధికారంలోకి వచ్చాక పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మరోవైపు రైతులను గాలికొదిలేశారన్నారు. బీమా, ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ప్రజలను దోచుకుని ఆదాయం పెంచుకునే దిశగా చంద్రబాబు చర్యలు మొదలు పెట్టారన్నారు. ప్రజలను మద్యానికి బానిసలుగా చేసి వారి సంపాదనను దోచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చిందన్నారు. రైతుభరోసా వంటి హామీలను తుంగలో తొక్కిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఉరవకొండలో జగనన్న కాలనీలకు మంత్రి పయ్యావుల కేశవ్ తన పేరు పెట్టుకోవడం సిగ్గు చేటన్నారు. ఇంటి స్థలం కోసం వైఎస్ఆర్ హయాంలో భూమి కొంటే.. జగనన్న పాలనలో ఇళ్లు నిర్మించి ఇచ్చామని, అలాంటప్పుడు మంత్రి కేశవ్ ఎలా తన పేరు పెట్టుకుంటారని నిలదీశారు. ఇప్పటికైనా కూటమి నాయకులు స్పందించి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలకు 'ప్రాజెక్ట్ ఎక్స్ పో' నాంది

'అనంతలక్ష్మి' ఛైర్మన్ అనంతరాముడు

విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అనంతరాముడు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రాజెక్ట్ ఎక్స్‌పో ద్వారా విద్యార్థులు అనేక కొత్త ఆలోచనలను, పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ అనంత రాముడు అన్నారు. మంగళవారం స్థానిక అనంతలక్ష్మి కళాశాలలో ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతలక్ష్మీ కళాశాల యాజమాన్యం ఎప్పుడూ కొత్త సాంకేతికతను అలవర్చుకోవడానికి కావాల్సిన అన్ని సౌకర్యాలనూ కల్పిస్తుందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రాజక్ట్ ఎక్స్‌పోలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ ఎం.రమేష్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి, డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న అంగన్వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు : సిడిపిఒ

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ లక్ష్మీప్రసన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలని కోరారు. కాగా ఇంటర్వ్యూలను పారదర్శంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా దళారులు చెబితే నమ్మి మోసపోవద్దని సూచించారు. డబ్బులు అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

గుత్తి : కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ ఈనెల 20న మృతిచెందిన మహిళ ఆచూకీ లభ్యమైంది. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన అన్వర్‌ఖాన్ భార్య షహనాజ్‌బేగం (53) పని నిమిత్తం రాయచూర్‌కు బయలుదేరింది. గుల్బర్గా రైల్వేస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఆమెను రాయచూరుకు వెళ్లేందుకు కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కించారు. అయితే ఆమె మార్గమధ్యంలో గుండెపోటుకు గురై మరణించింది. రైలు బోగీలో ప్రయాణిస్తున్న తోటి ప్రయాణికులు ఆమె నిద్రిస్తోందని అనుకున్నారు. గుత్తి రైల్వేస్టేషన్‌కు రాగానే తోటి ప్రయాణికులకు అనుమానంతో పరిశీలించగా మృతి చెంది ఉండటంతో రైల్వే అధికారులు సమాచారం ఇచ్చారు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టగా గుల్బర్గా వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

జాబ్‌మేళాలో 51 మంది ఎంపిక

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో 51 మంది అభ్యర్థులు ఉద్యోగులకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా టాటా ఎలక్ట్రానిక్స్, కోజంట్ కంపెనీ, ఈ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ వంటి కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు, మెకానికల్ హెచ్ఒడి సోమ్లానాయక్, సివిల్ హెచ్ఒడి రామకృష్ణారెడ్డి, ఇంగ్లీష్ అధ్యాపకురాలు షబానా, కంపెనీ ప్రతినిధులు మస్తాన్, సీడ్ యాప్ కోఆర్డినేటర్ సావిత్రమ్మ, ఎపి ఎస్ఎస్‌డిసి కోఆర్డినేటర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయడమేమనగా అనంతపురం జిల్లా, ఉరవకొండ మం॥, రాయంపల్లి గ్రామము నందు నివాసము వున్న **శ్రీమతి జి.శాంతమ్మ**, భర్త: **పర్వతరెడ్డి** అనువారికి హక్కు అనుభవం గల క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కెనరా బ్యాంకు, ఉరవకొండ టౌను బ్రాంచ్ నందు ఆయకము పెట్టినారు. అయితే ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ రిజిష్టరు సేల్‌డీడ్ పత్రం నెం: 3135/2011 ఆయకము పెట్టి ఋణము పొందినారు. అయితే సదరు కెనరా బ్యాంకు ఉరవకొండ టౌను బ్రాంచ్ ఉద్యోగి కోర్టులో కేసు దాఖలు చేయడానికి జిరాక్స్ సెంటర్ నందు ఒరిజినల్ సేల్‌డీడ్ పత్రం నెంబరు 3135/2011 పోగొట్టుకొనిపోయినది. కావున ఎవరికైన ఈ పత్రము దొరికినచో ఈ ప్రకటన వెలువడిన ఏడురోజులలోపు నాకు గాని లేదా బ్యాంకు వారికి గాని తెలియజేయవలసినదిగా కోరుతున్నాను.

SCHEDULE OF PROPERTIES

Lands to an extent of 4.50 Acres situated within Undabanda village fields Vidapanakal Mandal within SRD of Uravakonda & RD of Ananthapuramu.

S.No.	Sy. No.	A.C.	Details
1	227	17.71	Out of it, Ac. 2.00 Cents

Within the following boundaries:
East: Land of Venkata Lakshmamma @ Maheswaramma **West:** Land of Veligonda Sunkanna, **North:** Land of Bogappa, **South:** Land of B. Hanumanth Reddy

S.No.	Sy. No.	A.C.	Details
2	240/A	9.31	Out of it, Ac. 2.50 Cents

Within the following boundaries:
East: Land of Devineni Narayana Swamy, **West:** Land of Gonchi Hanumantha Reddy, **North:** Land of Gonchi Ramanna, **South:** Land of Devineni Somnapopaiah.
Lands to an extent of 2.67 Acres situated within Rayampalli village fields Uravakonda Mandal within SRD of Uravakonda & RD of Ananthapuramu.

S.No.	Sy. No.	A.C.	Details
3	203	1.11	Out of it, Ac. 0.28 Cents
4	204	9.07	Out of it, Ac. 2.39 Cents

Within the following common boundaries:
East: Land of K.Ayyanna, **West:** Vanka, **North:** Land of Anusuyamma, **South:** Land of Harijana Anjinaiah &others.

కె.రమేష్‌బాబు, అడ్వకేటు,
అనంతపురం. సెల్: 93985 49442

అన్నక్యాంటీన్ తనిఖీ

గుత్తి : పట్టణంలోని అన్నక్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా క్యాంటీన్‌లో ఆన్‌లైన్ సిస్టం ద్వారా టోకెన్ల పంపిణీని పరిశీలించారు. భోజనం గురించి తింటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం భోజనం అందజేయు సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలన్నారు. అలాగే క్యాంటీన్ ప్రాంగణంలో శుభ్రత పాటించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.

శారదకు పిహెచ్‌డి ప్రదానం

అనంతపురం : అనంతపురానికి చెందిన కె.శారదకు కామర్స్ విభాగంలో కెరీర్ పాయింట్ యూనివర్సిటీ, రాజస్థాన్ (కోట) పిహెచ్‌డీ ప్రదానం చేసింది. శారద యాన్ ఎనలైటికల్ స్టడీ ఆన్ ఫ్యాక్టర్స్ ఎఫెక్టింగ్ కస్టమర్స్ విత్ రెఫరెన్స్ టు అడాప్షన్ ఆఫ్ మొబైల్ బ్యాంకింగ్ అన్న అంశంపై డాక్టర్ నిర్మలమ్మ పర్యవేక్షణలో పరిశోధన చేసింది. దీంతో యూనివర్శిటీ పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఈమేరకు శారదను యూనివర్సిటీ అధ్యాపక బృందంతోపాలు పలువురు అభినందనలు తెలిపారు.

పదివేల క్యూసెక్కుల హామీని నెరవేర్చండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఉరవకొండలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హంద్రీనీవా పంట కాలవల గురించి స్పందించి, ఇరిగేషన్ ఎస్ఇతో పాటు జిల్లా అధికారులతో కలిసి పనులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని చెప్పడాన్ని సిపిఎం స్వాగతిస్తున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో పాటు ప్రధాన కాలువ వెడల్పుపై దృష్టి సారించాలన్నారు. జిల్లాకు అదనపు నీరు తీసుకుని ఒకే ఒక వరదు హంద్రీనీవా అని గుర్తు చేశారు. తుంగభద్ర నుంచి జిల్లాకు వచ్చే నీరు తక్కువగా ఉంటుందని, ఇప్పటికే కర్నూలులో లైనింగ్ పని పూర్తయినందున అదనపు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. జిల్లాకు హంద్రీనీవా నీరు మాత్రమే దిక్కు అవుతున్నందున వెంటనే హంద్రీనీవా కాలువను వెడల్పు పనులు ప్రారంభించాలన్నారు. ఎన్నికలకు ముందు పామిడి బహిరంగ సభలో చంద్రబాబునాయుడు చెప్పినట్లు పదివేల క్యూసెక్కులు జిల్లాకు నీరు తెచ్చుకున్నట్లయితే 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు. పక్కనున్న కర్నూల్, చిత్తూరు జిల్లాలకు కూడా సాగునీరు అందించవచ్చన్నారు. రాయలసీమ జిల్లా రిట్రైర్డ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో 6300 క్యూసెక్కుల నీటి సామర్థ్యానికి సంబంధించి కాలువకు వెడల్పు పెంచకుండా కేవలం లైనింగ్ వేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇదే జరిగితే జిల్లా ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అనంతపురం జిల్లా ప్రజలను రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత అధికారులు కంటే పాలకులపైనే ఎక్కువగా ఉందన్నారు. జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పదవి దక్కడంతో జిల్లాలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి ఎక్కువ అవకాశం ఉందనే ప్రజలు ఆశతో ఉన్నారన్నారు. వారి ఆశలను వమ్ము చేయకుండా సాగునీటి కాలువలను అభివృద్ధి చేసి పొలాలకు నీరివ్వాలన్నారు. గత వారం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు తెగిపోయి పంటలతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాప్తాడు మండల పరిధిలోని ఎం.బండమీద పల్లి చెరువు తెగిపోవడంతో దాదాపు 300 ఎకరాలలో తోటలు, పంట పొలాలు నేలకొరిగి రైతులు నష్టపోయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువుల కుంటలను పునర్ నిర్మాణం, మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉరవకొండ మండల పరిధిలోని బుదగవి చెరువు కట్ట పునర్నిర్మించాలన్నారు. చెరువులో పేరుకుపోయిన మట్టి తొలగించాలన్నారు. జొన్న, వేరుశనగ, మిర్చి, మొక్కజొన్న పంటలకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వెంటనే వారికి పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, శ్రీనివాసులు, ఉరవకొండ కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు శీనప్ప, రామాంజనేయులు నాయక్, మురళి, వెంకటేశులు, సిద్ధప్ప, వీరంజినేయులు, శివనంద,రవి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం, సిఐటియు నాయకులు

నినాదాలు చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పురపాలక సంఘంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాము అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ రాయదుర్గం మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తూ అనారోగ్యం, ప్రమాదవశాత్తు చనిపోయి ఏడాది గడిచినా వారి కుటుంబ సభ్యులకు ఇంకా ఉపాధిగానీ, రావాల్సిన సదుపాయాలుగానీ కల్పించకపోవడం బాధాకరమన్నారు. ప్రతినెలా సాంకేతిక లోపాల పేరుతో కార్మికులకు సక్రమంగా జీతాలు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో కార్మికులందరికీ పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని ఇపిఎఫ్, ఇఎస్ఐలో ఉన్న తప్పులను సవరించి కార్మికులందరికీ మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మరమ్మత్తులకు గురైన పుష్‌కాట్స్, వీల్ బ్యారర్స్, వాహనాలను రిపేరు చేయించాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని, సకాలంలో పనిముట్లు, రక్షణ పరికరాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని, టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. కాగా విషసర్పాల కాటుకు, విద్యుత్ ప్రమాదాలకు కార్మికులు చనిపోతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అనంతరం నిరుపేద కార్మికులందరికీ స్థలాలు, ఇల్లు ఇవ్వాలని తీర్మానించారు. ఆయా సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపట్టి నిరవధిక సమ్మెలోకి పోవడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఆదినారాయణ, సిఐటియు పట్టణకార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లేష్, కమిటీ సభ్యులు తిప్పేస్వామి, కామాక్షి, ఇంజినీరింగ్ సెక్షన్ నుంచి తిప్పేరుద్ర, రమేష్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నీటమునిగిన కాలనీల్లో అధికారుల పర్యటన

ముంపు ప్రాంత వాసులకు సహాయక చర్యలు

నీట మునిగిన కాలనీలో పర్యటిస్తున్న అనంతపురం రూరల్ తహశీల్దార్ మోహన్‌కృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం

భారీ వర్షం కారణంగా అనంతపురం అర్బన్, రూరల్ మండల లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పై ప్రాంతాల్లో ఉన్న కనగానపల్లి చెరువు, బండమీదపల్లి మరువల నుంచి నీరు రావడంతో అనంతపురం అర్బన్ పరిధిలోని రామకృష్ణ కాలనీ, అభ్యుదయ కాలనీ, నారాలోకేష్ కాలనీలు, అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ, ఆటో నగర్, సంత్ గురుదాస్ కాలనీలు నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న అనంతపురం అర్బన్, రూరల్ తహశీల్దార్లు హరికుమార్, మోహన్‌కుమార్ ఆయా సచివాలయ సిబ్బంది, అగ్నిమాపక, పోలీస్, వైద్య శాఖాధికారులతో ఆయా కాలనీలకు చేరుకుని వారికి కావాల్సిన ఆహారం, తాగునీరు, మౌలిక వసతులు కల్పించారు. కొందరిని తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. అర్బన్ పరిధిలో అనంతపురం రూరల్ పంచాయతీ-1, 2 కార్యాలయాలు, రూరల్‌కు ఆర్డీటీ స్టేడియం వద్ద ఉన్న వీరానాగమ్మ గుడి, ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించారు. కాగా నగరంలోని రామకృష్ణ కాలనీ, పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వం, ప్రయివేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఇకపోతే ఉప్పరపల్లి గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 194, 214, 215 భూమిలో వేసిన గుడిసెలను తొలగించేశారు. దాదాపు 500కుపైగా ఉన్న గుడిసెలను తొలగిస్తూ హెచ్చరికలు జారీచేశారు. దీంతో గుడిసెలు వేసుకున్న వాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

పాఠశాల జలమయం

నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల జలమయంగా మారింది. సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో పాఠశాల పరిసరాలు నీటితో నిండిపోయాయి. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామంది విద్యార్థులు పాఠశాలకు రాలేకపోయారు. వచ్చిన విద్యార్థులను కూడా తల్లిదండ్రులు వచ్చి వెనక్కి తీసుకెళ్లడం కనిపించింది. విషయం తెలుసుకున్న ఇఒఆర్‌డి శైలజారాణి, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, తదితరులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి పరిసరాలను పరిశీలించారు.

నీట మునిగిన పంట పొలాలు

గార్లదిన్నె : వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వరి 122 (ఎకరాల్లో), వేరుశనగ 11, పత్తి 22 కలిపి 159 ఎకరాల్లో పంటలు దెబ్బతిని 47 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నమోదు ప్రక్రియ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లలిత, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె మండలంలో నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

చట్టాలపై అవగాహన ఉండాలి

న్యాయసేవా సాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి శివప్రసాద్

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని న్యాయసేవా సాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి శివప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని గొరిదిండ్ల గ్రామపంచాయతీ డికె.తండాలో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ, జిల్లా గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉంటున్న షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ అధికారి శంకరనారాయణ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, మండల పరిషత్ అధ్యక్షురాలు హేమలత, సర్పంచి నాగరత్నమ్మ, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు కుళ్లాయప్ప, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, విఆర్ఒ రఫీ, మండల స్థాయి అధికారులు ఇంజినీర్లు పార్థసారథి, శివకుమార్, జమీల్‌బాషా, మెడికల్ ఆఫీసర్ సబీహా సుల్తానా, ఎపిఒ సుజాత, ఐసిడిఎస్ లావణ్య, అగ్రికల్చర్ అధికారి సుచరిత, సుజిత, హార్టికల్చర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పడమటికోడిపల్లి అంగన్వాడీ కేంద్రం మార్పు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పడమటి కోడిపల్లి గ్రామంలో ఇటీవల కులవివక్ష ఘటనపై స్పందించిన అధికారులు యుద్ధ ప్రాతిపాదికన అద్దె అంగన్వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ పాఠశాలలోకి మార్చినట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ తెలిపారు. పడమటి కోడిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కులవివక్ష చాలా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాన్ని తక్షణమే మార్చి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంతో ఐసిడిఎస్ అధికారులు ఊపిరిపించుకున్నారు.

ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రం

బిటిపికి పెరుగుతున్న నీటిమట్టం


బిటిపికి చేరిన నీరు

రాయదుర్గం : జిల్లా సరిహద్దున వేదవతి నదిపై నిర్మించిన భైరవానితిప్ప ప్రాజెక్టుకు క్రమేనా నీటి మట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 1655 అడుగులు కాగా ప్రస్తుతం 1652.9 అడుగులుగా ఉంది. వేదవతి నది పరివాహక ప్రాంతం కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో రిజర్వాయర్‌లోకి వెయ్యి క్యూసెక్కులపైగా నీరు వస్తోంది. నీటి ప్రవాహం ఇదే విధంగా పెరిగితే త్వరలోనే రిజర్వాయర్ పూర్తిగా నీటితో నిండే అవకాశం ఉంది.

పార్నపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తే అవకాశం

యల్లనూరు : పార్నపల్లి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లోకి సుమారు 12000 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు ధర్మవరం చెరువు మరవ పారుతోంది. అక్కడ నుండి వరద నీరు పార్నపల్లి రిజర్వాయర్‌లోకి చెరుతోంది. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ గేట్లు ఎత్తే అవకాశం ఉన్నట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. పార్నపల్లి రిజర్వాయర్‌లో 9 టిఎంసిలు దాటితే ఏ సమయంలో నైనా గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని యల్లనూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ శేషారెడ్డికి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ టోర్నీలో 'భాష్యం' విద్యార్థి ప్రతిభ

అనంతపురం : 9వ ఏపీ స్టేట్ ఇంటర్ జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో భాష్యం పాఠశాల విద్యార్థి జి.షణ్ముఖ అత్యంత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక విద్యాసంస్థలో రాయలసీమ సిఇఒ అనిల్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యాసంస్థం విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని అభినందించిన వారిలో అనంతపురం జిల్లా జెడ్ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్ఎం, పిఇటిలు ఉన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న భాష్యం పాఠశాల యాజమాన్యం విద్యార్థులు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో రైతు మృతి

మృతిచెందిన మారెప్ప

గుమ్మగట్ట : మండల పరిధిలో కొనాపురం గ్రామంలో రైతు హరిజన మారెప్ప (60) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఇంటికి తీసుకున్న కరెంట్ సర్వీస్ వైరు తెగిపోయి కింద పడింది. ఉదయం లేవగానే గమణించిన మారెప్ప కింద పడిన వైరును చేతితో పట్టుకుని కరెంటు స్తంభాన్ని ఎక్కినట్లు బంధువులు తెలిపారు. నేలంతా తడి ఉండడం.. ఎక్కిన ఇనుప నిచ్చెనకు వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. హుటాహుటిన గుమ్మఘట్టలో పిహెచ్‌సికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఈశ్వరయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు...

మృతిచెందిన భానుప్రకాష్

నార్పల : మండల కేంద్రంలోని నార్పల సుల్తాన్‌పేట సమీపంలో గూగూడు రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గూగూడు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న రామచంద్రారెడ్డి కుమారుడు నొస్పం భానుప్రకాష్‌రెడ్డి (19), సతీష్, ప్రణీత్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో భానుప్రకాష్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సతీష్, ప్రణీత్‌కు గాయాలు కావటంతో స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని హావలిగి అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు రెండు మోటార్ సైకిళ్లతోపాటు అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మునిస్వామి, జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రాత్రి విడపనకల్ మండలం హవలిగి పాత చెక్‌పోస్టు వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుహాసిని, ఉరవకొండ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి సిబ్బందితో తనిఖీ చేస్తుండగా రెండు వేర్వేరు మోటార్ సైకిళ్లలో పాల్తూరు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, బొమ్మనహాల్ మండలం గోవిందవాడకు అనిల్‌కుమార్‌ను కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుల నుంచి రెండు మోటార్ సైకిళ్ళు, 5 కార్టన్ బాక్సుల్లో 480 మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పామిడి : మండల కేంద్రంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెన్నానది నుంచి కొంతమంది అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరు ట్రాక్టర్లను పట్టుకుని యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు

రాయదుర్గం : రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామ సమీపంలో ఈనెల 19న జరిగిన నాయకుల బొమ్మన్న హత్య కేసులో అతడి కుమారుడు నాగరాజును మంగళవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు రాయదుర్గం పోలీస్ ఇన్‌స్పెక్టర్ జయనాయక్ తెలిపారు. నిందితుడి నంచి హత్యకు ఉపయోగించిన ముచ్చుకత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనతోపాటు భార్యను అపహాస్యం చేస్తూ మాట్లాడినందుకు తండ్రిపై కక్ష పెంచుకున్న నాగరాజు తండ్రి పదారుగుడ్డం గ్రామం వద్ద పొలం పని చేసుకుని ఎదురు వస్తుండగా మచ్చుకొడవలితో నరికాడు. అయితే ప్రమాదంలో గాయపడినట్లు నమ్మించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం నిందితుడు నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నాగరాజును విచారించగా తానే తన తండ్రిని హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. స్వల్ప వ్యవధిలో కేసును పరిష్కరించినందుకు ఇన్‌స్పెక్టర్ జయనాయక్, సిబ్బందిని ఎస్పీ, కళ్యాణదుర్గం డీఎస్పీ అభినందించారు.

మూర్ఛవ్యాధితో విద్యార్థి మృతి

గుత్తి : మూర్ఛవ్యాధితో మంగళవారం గుత్తిలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. యాడికి కి చెందిన రంగస్వామి కుమారుడు సాయి ధనుంజయ (20) గుత్తి పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో కళాశాలలోని తరగతి గదిలో ఉన్న సాయి ధనుంజయ కి ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆ యువకున్ని కళాశాల యాజమాన్యం, సిబ్బంది గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు.

సేవ, దానగుణాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రతిఒక్కరూ సేవ, దానగుణంతోపాటు సౌభ్రాతృత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. డీఎస్పీ ఆదేశాల మేరకు బర్కత్ షావలి దర్గా కమిటీ సభ్యులు, బ్రెడ్ శర్మాస్ వలి, చమ్మా అస్లాం, లడ్డూ షఫీ, అబూబకర్, ప్రభుత్వ ఖాజీ మహ్మద్ సైపుల్లా, ఖాజా ఆధ్వర్యంలో మంగళవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న మహబూబ్ సుబాని జెండా కట్ట వద్ద గౌసే పాక్ గ్యార్మి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ మహబూబ్ సుభానీ గౌసే పాక్ గ్యార్మి జరుపుకోవడం గొప్ప అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, అబ్దుల్‌వహాబ్, జామీ ఖాదిరీపీరా, సిఐలు జయానాయక్, వెంకటరమణ, తహశీల్దార్ నాగరాజు, ఎస్ఐ వలిబాషా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, ఉపఛైర్మన్ శ్రీనివాసయాదవ్, వార్డు మెంబర్లు ఫక్రుద్దీన్, అజయ్‌కుమార్, బాలరాజు, అడ్వకేట్ అబ్దుల్‌వహాబ్, కణేకల్ ఫక్రుద్దీన్, అహ్మద్, ఆఫీస్ అమానుల్లా, ముజాహిద్‌రజా, ఖాజాపీరా, రహమతుల్లా అష్రఫీ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

గిరిధర్‌నాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్ : మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కావలి గిరిధర్ నాయుడు (65) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని గిరిధర్‌నాయుడు భౌతికకాయానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు గ్రామదట్ల, జుంజురంపల్లి సర్పంచులు రాజశేఖర్, వన్నూరుస్వామి, టిడిపి నాయకులు హనుమంతురెడ్డి, వీరేష్, సోమశేఖర్, సిద్ధప్ప, బసవరాజు, శీన, తిప్పేస్వామి, రాజు, రమేష్, సీతారాములు, హనుమంతు, లక్ష్మన్న తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి : పోతుల

అనంతపురం : ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు పోతుల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. పాదచారుల సమస్యలు అన్నీఇన్నీ కావన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, గ్రామాల నుంచి వచ్చే ప్రజల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ట్రాఫిక్‌లో ఇరుక్కుంటే చాలా సమయం పడుతోందన్నారు. మరోవైపు నగర శివారు ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

అనంతపురం : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం శెట్టూరు మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలని, 12వ పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ కె.కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, మండల నాయకులు మల్లిఖార్జునగౌడ్, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

25న మెగా జాబ్‌మేళా

రాయదుర్గం : 74 ఉడేగోళం వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా నిరుద్యోగులు ఉన్నారన్నారు. వారికి ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతోనే 10వ, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ,బీటెక్ పాసైన నిరుద్యోగ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 40కిపైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్న జాబ్‌బేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు జానకిరాముడు, తాలూకా కన్వీనర్ ఉలుగప్ప, కార్యదర్శి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భూరీసర్వే గ్రామసభలు

బెళుగుప్ప : మండల పరిధిలోని గంగవరం, కోనంపల్లి గ్రామాల్లో రీసర్వే సమస్యలపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సి.షర్మిల మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అధికారులు పరిశీలించి అందరికీ న్యాయం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, వీఆర్వోలు, మండల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు

యల్లనూరు మండలంలో మాట్లాడుతున్న అధికారులు

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో సర్పంచి రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే ద్వారా నెలకొన్న సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సర్వాణి, విఆర్ఓ శిరీషా, సర్వేయర్ శంకర్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

కణేకల్లు : ఈనెల 21 నుంచి 24వతేదీ వరకూ మండలంలో రీసర్వే జరిగిన 9 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఫణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తుంబిగనూరు, యర్రగుంట, గురువారం బిదురుకుంతం, గేనిగేరి, శుక్రవారం రచ్చుమర్రి, గరుడచెడు, శనివారం మాల్యం, హనుమాపురం, సోమవారం సొల్లాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా సభల్లో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యలపై మాట్లాడితే వ్యక్తిగత విమర్శలా..

మేయర్ మహమ్మద్ వసీం

విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా రైతాంగంతోపాటు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం బాధాకరమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. మంగళవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా పని చేసిన అనంత వెంకటరామిరెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో రైతాంగం అధిక వర్షాలతో పంటలు పూర్తిగా నష్టపోవడమే కాకుండా ఎరువులు అందుబాటులో లేకపోవడం, రబీకి అవసరమైన విత్తనాల ధరలు విపరీతంగా పెరగడం, తుంగభద్ర, హంద్రీనీవా ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు రాకపోవడం వంటి సమస్యలపై జిల్లా అధ్యక్షులుగా అనంత వెంకటరామిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. అయితే వీటిపై సమాధానం చెప్పకుండా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ కలిసి డైవర్షన్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. టిడిపి నేతల ఇసుక, మద్యం దందాలపై వారికి అనుకూలంగా ఉన్న మీడియాల్లోనే కథనాలు వస్తున్నాయన్నారు. ముందు వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో గ్రామాల్లోనే ఆర్‌బికెల ద్వారా రైతల గుమ్మం వద్దకే ఎరువులు, విత్తనాలు అందించామని గుర్తు చేశారు. వీటికితోడు పంటల బీమా ప్రభుత్వమే చెల్లించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించిన ఘనత తమకే దక్కిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాత సుఖీభవ అందక, ఎరువులు, విత్తనాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జిల్లాకు హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు వస్తున్నాయంటే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువ, అప్పటి ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి, నాటి మంత్రి రఘువీరారెడ్డి కృషితోనే సాధ్యమయ్యాయన్నారు. అయితే నేడు తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పొంగి పొర్లుతున్నా పూర్తిస్థాయిలో నీటిని జిల్లాకు తీసుకురాకుండా ఇసుక, మద్యం ఆదాయం కోసం అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దృష్టి సారించారని విమర్శించారు. అంతేగాకుండా 'తాగినోళ్లకు తాగినంత' అన్న చందంగా రూ.99కే మద్యాన్ని అందిస్తున్నారని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. నాలుగు నెలల పాలనలోనే 74 మంది చిన్నారులు, విద్యార్థినులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. ఇప్పటికైనా టిడిపి నేతలు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, నరసింహులు, రహంతుల్లా, కమల్ భూషణ్,అనిల్ కుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు రామచంద్ర,కాకర్ల శీనా తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో..

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అధికారం కోల్పోయిన తర్వాత గోరంట్ల మాధవ్‌కు పిచ్చిపట్టినట్లు ఉందన్నారు. గత ఐదేళ్లల్లో నీవు హిందూపురం పార్లమెంటుకు ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. నీవు చేసిన అవినీతి, అక్రమాల వల్లే 2024లో వైసిపి టికెట్ కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడినా ఎంపీగా ఏనాడూ బయటకు రాని నీరు ఇప్పుడు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మంచిది కాదన్నారు. వైసిపి నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేరన్నారు. నిందలు మోపి అభివృద్ధికి అడ్డుపడాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని గుర్తు చేశారు. మహిళలు, బాలికలను ఎలా కాపాడుకోవాలో తమ ప్రభుత్వానికి తెలుసు అన్నారు.

కళ్యాణదుర్గం : రాజకీయ అవగాహన లేకుండా కూటమి ప్రభుత్వంపై విజ్ఞత లేకుండా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడటం సరికాదని టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ రైతులకు ఎలాంటి సాయం చేశారో గుర్తు చేసుకోవాలని సూచించారు. గోరంట్ల మాధవ్ ఇప్పటికైనా చౌకబారు విమర్శలు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు చెవుల మల్లికార్జున, కన్వీనర్లు శివన్న, డీకే రామాంజనేయులు, గొల్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 24న ప్రతిభా పురస్కారాలు పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2023-24వ సంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు వచ్చేనెల 24న స్థానిక జయమనెమ్మ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేయనున్నట్లు నాయీబ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్టీసీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక జయమనెమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో 480, ప్రయివేట్ పాఠశాలల్లో 520, ఇంటర్‌లో ప్రభుత్వం కళాశాలల్లో 850, ప్రయివేటు కళాశాలల్లో 900పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు నవంబర్ 15వ తేదీలోపు ఎం. శ్రీనివాసులు ఆర్టీసీ, డోర్ నెంబర్ 18/1/406 వేణుగోపాల్ నగర్, పాతూరు అనంతపురం చిరునామాకు దరఖాస్తులను పంపించాలన్నారు. ఇతర వివరాలకు సెల్..94405 01463, 94412 22874 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్రమణ్యం, జిల్లా గౌరవ సలహాదారులు శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, జిల్లా కార్యదర్శి శివశంకర్, జిల్లా కోశాధికారి నాగరాజు, నాయకులు జెవి రమణ, బీసీ వరదరాజులు, శివయ్య, ఎక్సైజ్ నరసింహులు, కరెంట్ రామాంజనేయులు, ఎం.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నీటి శుద్ధికేంద్రాలకు మరమ్మతులు చేయాలి

డిప్యూటీ డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న నీటిశుద్ధి కేంద్రాలకు వెంటనే మరమ్మతులు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పాఠశాలల తనిఖీకి వచ్చిన డిప్యూటీ డిఇఒ శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొత్రేష్ మాట్లాడుతూ రాయదుర్గం తాలూకా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ప్రభుత్వ స్కూల్లో వాటర్‌ప్లాంట్లు పని చేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే వాటర్‌ప్లాంట్లకు మరమ్మతులు చేసి విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే బొమ్మనహాల్ మండలంలో రేకులషెడ్లలో నిర్వహిస్తున్న మేథా ప్రయివేటు పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాయదుర్గంలోని సెయింట్ పాల్, భావన, క్రిసెంట్, తదితర ప్రయివేటు పాఠశాలలు కూడా రేకులషెడ్లలోనే నడుస్తున్నాయన్నారు. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

ఉరవకొండ మండలంలో నిర్వహించిన పొలంబడిలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని విడపనకల్లు, ఉరవకొండ మండలాల వ్యవసాయ అధికారులు పెన్నయ్య, శుభకర్ సూచించారు. మంగళవారం విడపనకల్లు మండల పరిధిలోని మళాపురం, కొట్టాలపల్లి, ఉరవకొండ మండలంలోని వ్యాసాపురం, నెరమెట్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కంది, జొన్న, ఇతరపంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మళాపురం సర్పంచి ఆశాలత, ఎఇఒ రాఘవేంద్ర, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు యోగానంద, శివలత, వన్నప్ప, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన అధికారి ఎం.కృష్ణతేజ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సాగు చేసిన వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలు నష్టపోయికుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం ఆగిన తర్వాత సాధ్యమైనంత వరకూ వరద నీటిని తోట నుంచి వెలుపలకు పంపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఆర్ఎస్‌కె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పామిడి : మండలంలోని ఖాదర్‌పేట, అనుంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా

'పొలంబడి'లో అధికారులు

మండల వ్యవసాయాధికారి లీనా వసుంధర వివిధ రకాల పంటల్లో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపిపి మహేష్, టిడిపి మండల కన్వీనర్ ముసిలిరెడ్డి, అనుంపల్లి సర్పంచి నారాయణస్వామి, ఎఇఒ శ్రీనివాస్, ఎంపిఇఒ అర్చన, రామాంజనేయులు, రైతులు హరికృష్ణ, రవి, విరూపాక్షి, చంద్రశేఖర్‌రెడ్డి, స్వామినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గొంచిరెడ్డిపల్లి, పిల్లలపల్లి,

పామిడి మండలంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి లీనా వసుంధర

ముప్పులకుంట, తదితర గ్రామాల్లో ఉద్యానవన అధికారి కృష్ణ మంగళవారం పర్యటించారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షం ఆగిన తర్వాత సాధ్యమైనంత వరకూ వరద నీటిని తోట నుంచి వెలుపలకు పంపి భూమి ఆరే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అరటిలో అధిక తేమ కారణంగా సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కావున ప్రొపికోనజోల్ 1 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి జిగురు మందుతో పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

అనంతపురం : అనంతపురం మండల పరిధిలోని ఎ.నారాయణపురం, నాగిరెడ్డిపల్లి రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ అధికారిణి శశికళ రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం మట్టి పరీక్ష ఫలితాల కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి అధికారులు, సెరికల్చర్ అధికారి ఓబులేసు, వెటర్నరీ అసిస్టెంట్ మురళీకృష్ణ, రైతుసేవా కేంద్రం సహాయకులు నాగలత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రహదారికి మరమ్మతులు

రోడ్డు మరమ్మతులు చేస్తున్న జెసిబి

బ్రహ్మసముద్రం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో మండల పరిధిలోని గొంచిరెడ్డిపల్లి గ్రామంలో బస్టాండ్ వద్ద రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో మాజీ ఎంపిపి భర్త వన్నూరుస్వామికి సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బస్టాండ్ ఆవరణలో నిల్వ ఉన్న నీటిని జెసిబి సాయంతో బయటకు పంపి ఎర్రమట్టి వేసి చదును చేశారు. దీంతో ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ లచ్చి, వైస్ సర్పంచి దొణతిమ్మ, గోవిందు, నాగిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గొల్ల చిత్తప్ప, హరిజన గోవిందు, బోయ ఆనంద్, బోయ నగేష్, ఎర్రిస్వామి, గోవిందు, పూజారి హరీష్, దొడగట్ట గోవిందు, నగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ బాలుర ఛాత్రాలయంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు సౌధామణి, ప్రవాస భారతీయులు శ్రీనివాసులు పుట్టినరోజును పురస్కరించుకుని ఆయా కార్యక్రమాలకు సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి, స్వామి శ్రీసత్యాత్మానంద, సౌధామణి, చక్రపాణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం

పెద్దవడుగూరు : దేశసేవలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్ఐ ఆంజనేయులు కొనియాడారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో అమరవీరుడికి నివాళు లర్పించారు. మండలానికి చెందిన కొందరు బిఎస్ఎఫ్ జవాన్లు దేశ సరిహద్దుల్లో పహారా కాస్తున్న సమయంలో మిలిటెంట్ల దాడిలో మరణించిన కొత్తపల్లికి చెందిన దేవన సుధాకరరెడ్డి, పెద్దవడుగూరుకు చెందిన కుమ్మెత సుదర్శనరెడ్డి కుటుంబాలను ఎస్ఐ ఆంజనేయులుతో పాటు జమెదారు మోహన్, మనోహర్ తదితరులు పరామర్శించారు. అనంతరం వారిస్థూపాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం

పామిడి : మండల కేంద్రంలోని కెజిబివిలో ఆర్డీటీ, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాసరచన, ఇతర పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బిటిపికి నిధులు కేటాయించాలని వినతి

మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం ప్రజలకు అత్యంత ముఖ్యమైన భైరవానితిప్ప ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని అమిలినేని సురేంద్రబాబు కోరారు. ఈమేరకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు తీసుకొస్తే ఈ ప్రాంత రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా 114 చెరువులకు నీళు ఇవ్వవచ్చన్నారు. కావున వెంటనే బిటిపిని నిధులు ఇచ్చి నియోజకవర్గ ప్రజలు, రైతులను ఆదుకోవాలని కోరారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీదేవి మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు ఎవరైనా ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీ కేంద్రం కొనసాగుతుందన్నారు. 23న చామలూరు, 24న నడిమిదొడ్డి, 25 నాయనపల్లి గ్రామ సచివాలయాల ఆవరణలో ఆధార్ కేంద్రాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్కిల్, స్టడీసెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

పుట్లూరు : మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్కిల్, స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని పుట్లూరు యూత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం స్కిల్, స్టడీసెంటర్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించి బండారు శ్రావణిశ్రీ తప్పకుండా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సామూహిక నట్టల నివారణ కార్యక్రమం

బెలుగుప్ప : మండల పరిధిలోని శ్రీరంగపురం, గుండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం ఉచిత సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా శ్రీరంగపురంలో 1374, గుండ్లపల్లిలో 1637 జీవాలకు నట్టల నివారణ మందు తాపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగపురం సర్పంచి మారుతీరెడ్డి, స్థానిక నాయకులు, గొర్రెల కాపరులు, పశు వైద్యసిబ్బంది మారుతి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనుల పరిశీలన

గుత్తి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బసినేపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టిన సిసి రహదారి పనులను ఎంపిడిఒ డి.ప్రభాకర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రహదారిని నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం బసినేపల్లి తండా గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు చిన్నారులకు ఇస్తున్న పోషకాహారాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీర్ మల్లేష్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచి మృతి

అచ్చుకట్ల గౌస్‌బీ (పాతచిత్రం)

యల్లనూరు : యల్లనూరు పంచాయతీ మాజీ ఉపసర్పంచి అచ్చుకట్ల గౌస్‌బీ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందింది. అయితే పరిస్థితి విషమించడంతో స్వగృహంలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న జడ్పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ బి.వినూత్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలోని గదులు, రిజిస్టర్లు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వసతులు, వైద్య సదుపాయం, డాక్టర్ల పని వేళలు, తదితర అంశాలపై రోగులతో ఆరాతీశారు. రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సరైన వైద్య సదుపాయలు కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి.వినూత్న